సాక్షి ప్రకాశం

సోమవారం । 4 । ఆగస్టు । 2025



పాతాళంలోకి నిమ్మధర

నిమ్మకాయల ధరలు పాతాళంలోకి పడిపోవడంతో ఆ రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. - 8లో..



వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

టంగుటూరు, పొదిలి మండలాల్లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు యువకులు మృతి చెందారు. - 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38 /28

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఆ డీలర్లపై 6ఏ కేసులు



కేతగుడిపి రేషన్‌షాపును తనిఖీ చేస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

తర్లుపాడు: డీలర్లు రేషన్ బియ్యం ఇవ్వకుండా వాటికి బదులుగా కార్డుదారులకు డబ్బులు ఇస్తుండటంపై ఆదివారం సాక్షి మెయిన్ ఎడిషన్‌లో ప్రచురితమైన ''బియ్యం లేవ్.. డబ్బులు తీస్కో..'' కథనంపై ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ డేవిడ్‌రాజు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ముకుంద హరి స్పందించారు. మండలంలోని కేతగుడిపి, సూరేపల్లి రేషన్ షాపుల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. డీలర్ల సమక్షంలో స్టాక్‌ను పరిశీలించారు. రెండు చోట్ల ఎక్కువ మొత్తంలో బియ్యం ఉన్నట్లు గుర్తించారు. కేతగుడిపిలో వీఆర్వో కాశీశ్వర్‌రెడ్డికి స్టాక్ అప్పగించారు. సూరేపల్లిలో డీలర్ పొంతన లేని సమాధానం ఇచ్చారు. దీంతో ఇద్దరు డీలర్లపై 6ఏ కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కాల్ సెంటర్ 1100

ఒంగోలు సబర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారం కోసం కాల్ సెంటర్-1100ను ప్రవేశపెట్టిందని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. ఈ మేరకు ఆమె ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఈ ద్వారా ప్రజలు సమస్యలను అర్జీల రూపంలో ఆన్‌లైన్ ద్వారా కూడా నమోదు చేసుకోనవచ్చన్నారు. అర్జీదారులు 1100 నంబర్‌కు డయల్ చేసి, తమ సమస్యను విన్నవిస్తే ఆన్‌లైన్‌లో ఫిర్యాదు రిజిస్టర్ చేసుకుంటుందని వివరించారు. ఆ సమస్యను సంబంధిత అధికారికి పంపి తద్వారా పరిష్కరించేందుకు వీలుకలుగుతుందన్నారు. సమస్యను కాల్ సెంటర్‌లో నమోదు చేసిన మొబైల్ నంబర్‌కు ఎస్‌ఎంఎస్ ద్వారా నిర్ధారణ సందేశం పంపుతారని వివరించారు.

మెడికలేనా..

మార్కాపురం మెడికల్ కాలేజీలో ఈ ఏడాది కూడా అడ్మిషన్లు లేనట్లే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కాలేజీ నిర్మాణాన్ని అర్ధంతరంగా నిలిపేయడంతో భవన నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. గతంలో మెడికల్ కాలేజీ కోసం కేటాయించిన వైద్యులు, ప్రొఫెసర్లను బదిలీ చేశారు. దీంతో ఇప్పటికే ప్రారంభమైన ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం కౌన్సెలింగ్‌లో మార్కాపురం కాలేజీని చేర్చలేదు. కూటమి ప్రభుత్వ తీరుతో పశ్చిమ ప్రకాశంలో మెడికల్ కాలేజీ కలగానే మిగిలిపోయేలా ఉందని ఈ ప్రాంత ప్రజలు మండిపడుతున్నారు.

- ఏడాదిగా నిలిచిన మార్కాపురం మెడికల్ కళాశాల నిర్మాణం
- ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌లో మార్కాపురం కాలేజీని చేర్చని ప్రభుత్వం
- ఈ ఏడాది కూడా అడ్మిషన్లు లేనట్టే
- మండిపడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు



నిలిచిపోయిన మెడికల్ కళాశాల

మార్కాపురం: కూటమి ప్రభుత్వం నూతన మెడికల్ కాలేజీలపై కక్ష కట్టింది. మొదట్లో పీపీపీ విధానంలో నిర్మిస్తామంటూ చెప్పి నిర్మాణాలు మాత్రం నిలిపేసింది. దీంతో మార్కాపురంలో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీ నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది. కాలేజీ నిర్మాణ పనులు యధావిధిగా జరిగి ఉంటే ఈ ఏడాదైనా ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం ప్రవేశాలు ప్రారంభమై ఉండేవి. కానీ అలా జరగలేదు. దీంతో ఈ ఏడాది మెడికల్ కౌన్సెలింగ్‌లో మార్కాపురం మెడికల్ కాలేజీని చేర్చలేదు. నిర్మాణం పూర్తయి ఉంటే నీట్ రాసిన విద్యార్థులు మార్కాపురం మెడికల్ కాలేజీలో ఆప్షన్ ఎంచుకునే వారు ఎంబీబీఎస్‌లో చేరేందుకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ల నమోదు ఇప్పటికే ప్రారంభమైంది. అందులో మార్కాపురం మెడికల్ కాలేజీ లేకపోవడంతో తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది పశ్చిమ ప్రకాశం నుంచి నీట్ పరీక్షను సుమారు 5 వేల మంది రాశారు. పలువురు అర్హత సాధించారు. అయితే వారందరూ మార్కాపురం మెడికల్ కళాశాల పూర్తి కాకపోవడంతో రాష్ట్రంలోని వివిధ మెడికల్ కళాశాలలను ఆప్షన్లుగా ఎంచుకున్నారు.



మెడికల్ కాలేజీలో పూర్తికావచ్చిన హాస్టల్ బ్లాక్

గత ప్రభుత్వంలో 75 శాతం పూర్తయిన పనులు:

పశ్చిమ ప్రకాశంలోని సుమారు 8 లక్షల మంది ప్రజలకు అత్యాధునిక వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మార్కాపురానికి సుమారు రూ.475 కోట్లతో మెడికల్ కళాశాలను మంజూరు చేశారు. 150 ఎంబీబీఎస్ సీట్లను దృష్టిలో ఉంచుకొని జీజీహెచ్ వైద్యశాల అభివృద్ధి పనులను, మెడికల్ కళాశాల నిర్మాణ పనులు చేపట్టారు. మార్కాపురం మండలం రాయవరం వద్ద 41.97 ఎకరాల విస్తీర్ణంలో మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు గత ఏడాది సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ రిజల్ట్ వచ్చే వరకూ జరిగాయి. పనులు కూడా గత రెండేళ్లలో వేగంగా జరగడంతో దాదాపు 75 శాతం పూర్తయ్యాయి. సిబ్బంది క్వార్టర్లు, నర్సింగ్ కళాశాల, జంట్స్, లేడీస్ హాస్టల్స్, క్లాసు రూములు, సెంట్రల్ క్యాంటిన్ పూర్తయ్యాయి. ప్రస్తుతం కళాశాలలో విద్యుత్ వైరింగ్, ప్లంబింగ్ పనులు, రంగులతోపాటు కొన్ని భవనాల నిర్మాణాలు పూర్తిచేయాల్సి ఉంది. జిల్లా వైద్యశాలను జీజీహెచ్‌గా మార్చడంతోపాటు 450 బెడ్లు ఏర్పాటుచేసి, 82 మంది ప్రొఫెసర్లు, అసిస్టెంటు ప్రొఫెసర్లు, డాక్టర్లు అందుబాటులో ఉంచారు. దీంతో రోజుకు సుమారు 750 నుంచి 800 మంది పేషంట్లు వైద్యసేవలు పొందేవారు. 3 ఆక్సిజన్ ప్లాంట్లు, ఐసీయూ యూనిట్, వెంటిలేటర్ సౌకర్యాలను కూడా కల్పించారు. గత ఏడాది జూన్ 24న నేషనల్ మెడికల్ కౌన్సిల్‌ఆఫ్ ఇండియా బృందం మెడికల్ కాలేజీని, జీజీహెచ్‌ను సందర్శించి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపారు. అయితే ఆ నివేదిక ఏమైందో తెలీదు కానీ కూటమి ప్రభుత్వం మాత్రం అసంపూర్తి భవనాలంటూ నిలిపేయడంతో పాటు జీజీహెచ్‌లో ఉన్న సుమారు 40 మంది మెడికల్ కళాశాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్లను రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు బదిలీ చేసింది.



నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీ

అయితే ఏడాది నుంచి ఈ పనులు కూడా జరగలేదు. కళాశాల నిర్మాణం పూర్తయి ఉంటే జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన 450 బెడ్లు ఉపయోగపడి ఉండేవి. వైద్య విద్యార్థుల ప్రాక్టికల్స్ కోసం అనేక ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా జనరల్ మెడిసిన్ కోసం 100, ఆప్తమాలజీ 20, డెర్మటాలజీ 10, సైకియాట్రీ విభాగం 10, జనరల్ సర్జరీల కోసం 100, ఆర్థోపెడిక్ విభాగానికి 40, ఈఎన్‌టీకి 20, ఐసీయూ బెడ్లు 20, పీడియాట్రిక్స్ 50, ఓబీజీ (ప్రసూతి గైనకాలజీకి) 50 బెడ్లను కేటాయించారు. వీటిలో ప్రస్తుతం కొన్ని బెడ్లు మాత్రమే రోగుల కోసం ఉపయోగిస్తున్నారు.

పీపీపీ విధానంపై ఆగ్రహం

గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆధ్వర్యంలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేపట్టగా నూతనంగా వచ్చిన కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని మెడికల్ కళాశాలలను గుజరాత్ తరహాలో పీపీపీ (పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్) విధానంలో చేపట్టే ప్రతిపాదనలు చేస్తున్నామని చెప్పి ఏడాది గడిచినా ఇంత వరకూ అడుగు ముందుకు పడలేదు. ఈ విధానం గుజరాత్ రాష్ట్రంలో అమలవుతోంది. దీని వలన ఏటా ఫీజులు పెంచుతారు. ఎంబీబీఎస్ విద్యార్థులకు మెడికల్ విద్య భారమవుతుంది. ప్రైవేటు వ్యక్తుల నియంత్రణలో వైద్యసేవలు అందుతాయి. దీంతో జీజీహెచ్, మెడికల్ కాలేజీ ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లనున్నాయి. కార్పొరేట్ వైద్యశాలల రేట్లు పాటిస్తారు. ఈ విధానంపై అన్ని వర్గాల ప్రజల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది.

మెడికల్ కాలేజీ త్వరగా పూర్తిచేయాలి



మార్కాపురం మండలం రాయవరం దగ్గర నిర్మిస్తున్న మెడికల్ కాలేజీని ప్రభుత్వం త్వరగా పూర్తిచేయాలి. దీని వలన 100 మెడికల్ సీట్లు మంజూరైతే ఈ ప్రాంత విద్యార్థులకు ఎంబీబీఎస్ విద్య అందుబాటులోకి వస్తుంది. దీనితోపాటు జీజీహెచ్‌లో కూడా రోగులకు మెరుగైన సేవలు లభిస్తాయి. ప్రభుత్వమే మెడికల్ కాలేజీని నిర్వహించాలి. పీపీపీ విధానం వద్దు.

– డీఎంకే రఫీ, సీపీఎం నాయకులు



సభాప్రాంగణానికి ర్యాలీగా వస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



సభలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు

అబద్ధపు హామీలతో బాబు వంచన

- ఆరు హామీలతో పాటు మరో అదనపు హామీలంటూ మోసం
- మీ ఇంటికే నేరుగా డబ్బులు అందుతాయని అబద్ధపు హామీలు
- బాబు మోసాలను ఎండగట్టిన ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

పెద్దదోర్నాల: ఎన్నికల్లో అలివికాని హామీలిచ్చిన చంద్రబాబు రాష్ట్ర ప్రజలను నిలువునా ముంచారని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ విమర్శించారు. శ్రీశైలం రహదారిలోని మల్లికార్జున ఎస్టేట్స్‌లో ఆదివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ సభలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. మండల పార్టీ కన్వీనర్ గంటా రమణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో గెలవక ముందు ఒక్కొక్క ఇంటికి రూ.6 లక్షలు ఇస్తామంటూ చంద్రబాబు అబద్ధపు హామీలు ఇచ్చారన్నారు. ఆరు హామీలతో పాటు మరో 143 అదనపు హామీలు జూలై 24 నుంచి అమలవుతాయని మోసం చేశారన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం అంటూ కులాలు, సినిమాలను అడ్డు పెట్టుకున్నారని, అడ్డగోలు హామీలతో, ఒక జెండా, అజెండా లేని పవన్ కళ్యాణ్‌తో పొత్తులు పెట్టుకొని ప్రజలను మోసం చేశారని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు, ప్రతి ఒక్క మహిళకు రూ.18 వేల ఆర్థిక సహాయం, తల్లికి వందనం పేరుతో ప్రతి ఒక్క బిడ్డకు రూ.15 వేలు, ఉచిత ఇసుక, రైతు భరోసాను పేరు మార్చి అన్నదాత సుఖీభవ అనే పథకం ద్వారా రైతులకు డబ్బులు ఈ విధంగా ఎన్నో పథకాలు అందిస్తామంటూ బాండ్లు కూడా ఇచ్చి ఇప్పుడు ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఈ అబద్ధపు హామీలను ప్రతి ఒక్కరూ ప్రశ్నించాలన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

వెలిగొండ ప్రాజెక్టుపై కూటమి నిర్లక్ష్యం:

తీవ్ర కరువు కాటకాలతో అలమటిస్తున్న పశ్చిమ ప్రాంతానికి సంజీవని అయిన వెలిగొండ ప్రాజెక్టును దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరెడ్డి తీసుకొచ్చారని, ఆయన తనయుడు వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఆ ప్రాజెక్ట్‌కు పూర్తి స్థాయిలో నిధులు కేటాయించి జాతికి అంకితం చేశారని అన్నారు. కేవలం రూ.2 వేల కోట్లు కేటాయించి ముంపు గ్రామాల ప్రజలను అక్కడ నుంచి తరలిస్తే శ్రీశైలం డ్యాం నుంచి పుష్కలంగా వచ్చే నీటి వరద ఈ ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగపడేదని అన్నారు. సముద్రంలో వృథాగా కలిసే 30 టీఎంసీల నీటితో నల్లమల సాగర్ నీటితో కళకళలాడేదని ఆయన పేర్కొన్నారు. కేవలం మీ చాతగాని, దద్దమ్మ కూటమి పాలన వల్ల నిధులు కేటాయించలేకపోయారని విమర్శించారు. ఈ ప్రాంతానికి ఎమ్మెల్యేలు, మంత్రులు వచ్చి సభలు పెట్టడం చంద్రశేఖర్ మీద సవాళ్లు విసరటం కాదని, దమ్ముంటే మీ పరిపాలనపై ఇప్పుడే డిబేట్ చేద్దామని ఆయన సవాల్ విసిరారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రికి ఇక్కడి కష్ట సుఖాలు ఏం తెలుసో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి మంత్రి వర్గంలో పని చేసిన జిల్లా ఇన్‌చార్జి మంత్రికి ఇక్కడి సమస్యలపై 12 లెటర్లు ఇచ్చానని, ఆయన ఎంత మాత్రం స్పందించి ఇక్కడ పనులు చేశారో చెప్పాలన్నారు.

ఆర్టీసీ బస్టాండ్ మీ అబ్బ సొత్తా..

తెలుగుదేశం పార్టీ సమావేశాన్ని ఆర్టీసీ బస్టాండ్‌లో పెట్టుకోవటానికి అదేమన్నా మీ అబ్బ సొత్తా అంటూ ఎమ్మెల్యే తాటిపర్తి ఆ పార్టీ నాయకులను ప్రశ్నించారు. ఇన్‌చార్జి అని పేరు పెట్టుకున్న ఓ నేత నియోజకవర్గాన్ని లూటీ చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. ప్రజలు తిరగబడటం మొదలు పెడితే వీళ్లందరి పంచెలు ఊడి పోతాయని హెచ్చరించారు. ప్రజలకు మీరు సేవ చేస్తారన్న ఆశతో మంచి అవకాశం ఇచ్చారని, కానీ రాబందులుగా మారి ప్రజలను దోచుకుంటున్నారని ఆయన తీవ్రంగా విమర్శించారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలో 20 ఏళ్ల క్రితం వేసిన పైపులైనును జేసీబీలతో తవ్వకుని రూ.25 కోట్లు దోచుకునేందుకు ప్లాన్ వేశారని, తాను కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే ఒక కిలో మీటర్ తవ్వేందుకు అనుమతి ఇచ్చామని అధికారుల చెప్పారన్నారు. ఒక నియోజక వర్గంలో ఏర్పాటు చేసిన పైప్‌లైన్‌ను మరో నియోజకవర్గంలో వేసేందుకు అనుమతులు ఉంటాయా అని ఆయన ప్రశ్నించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో భారీ ర్యాలీని నిర్వహించిన ఎమ్మెల్యే తొలుత నటరాజ్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మోటారు బైక్ ర్యాలీతో సభాప్రాంగణానికి చేరుకున్నారు. కార్యక్రమంలో మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ మజీద్, ఐటీ విభాగం జిల్లా అధ్యక్షులు దొందేటి నాగేశ్వరరెడ్డి, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి గుమ్మా పద్మజా యల్లేష్, ఎస్టీ నాయకులు దుమావత్ లతా చంద్రకాంత్‌నాయక్, మైనారిటీ సెల్ జిల్లా కార్యదర్శి దూదేకుల రసూల్, పుల్లల చెరువు పార్టీ నాయకుడు ఉడుముల శ్రీనివాసుల రెడ్డి పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

యర్రగొండపాలెం: అగ్రిగోల్డ్ బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక శివాలయం కమ్యూనిటీ హాలులో ఆదివారం మార్కాపురం, యర్రగొండపాలెం నియోజకవర్గాలకు చెందిన అగ్రిగోల్డ్ బాధితుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు నియోజకవర్గాల్లో కంపెనీకి చెందిన వేలాది ఎకరాల భూములు అగ్రిగోల్డ్ యాజమాన్యం డైరెక్టర్ల పేరుతో ఉన్నాయని, అవ్వా కుటుంబ సభ్యుల పేర్లతో ఎక్కువగా భూములు ఉన్నాయని, అవ్వా వెంకటరామారావు చైర్మన్‌గా, తన సోదరులు 8 రాష్ట్రాల్లో 32 లక్షల మందిని నిలువునా ముంచేశారని అన్నారు. కోర్టు పేరుతో తప్పుడు పద్దతుల్ని అవలంబిస్తూ ప్రభుత్వాన్ని, బాధితులను మోసం చేసి ఆస్తులను కొల్లగొట్టటానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. యాజమాన్యం ఆస్తులను కొల్లగొట్టినా, సీఎం చంద్రబాబు సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని చెప్పినా అగ్రిగోల్డ్ బాధితులకు మాత్రం న్యాయం జరగదని అన్నారు. బాధితుల పక్షాన నిలబడి ప్రభుత్వంపై సానుకూల ఒత్తిడి తెచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఆయన హామీ ఇచ్చారు. సీఎం చంద్రబాబు ఒక గంట అగ్రిగోల్డ్ బాధితుల సమస్యపై దృష్టి పెడితే ఆ సమస్యకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. సమావేశంలో అగ్రిగోల్డ్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కేవీవీ.ప్రసాద్, అగ్రిగోల్డ్ బాధిత సంఘ నాయకులు జీఎల్ సుబ్బారావు, పి.రామయ్య, జి.వెంకటసుబ్బయ్య, పిచ్చయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల

దర్శి టీడీపీలో రాజుకున్న వర్గపోరు

- సీఎం పర్యటనలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావుకు అవమానం
- నియోజకవర్గ ఇన్‌చార్జ్ లక్ష్మి తీరుపై భగ్గుమంటున్న పాపారావు వర్గం
- విలేకరుల సమావేశానికి పాపారావు డుమ్మా

దర్శి: ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన దర్శి టీడీపీలోని వర్గపోరును మరింత రాజేసింది. మండలంలోని తూర్పు వీరాయపాలెంలో శనివారం జరిగిన సీఎం పర్యటనలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మికి, ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావుకు మధ్య విభేదాలు బట్టబయలయ్యాయి. ముఖ్యమంత్రి ప్రయాణిస్తున్న బస్సులోకి పక్క నియోజకవర్గాలకు చెందిన మాజీ ఎమ్మెల్యేలైన దివి శివరాం, బాచిన చెంచుగరటయ్యలను ఎక్కనివ్వగా స్థానిక నాయకుడైన మాజీ ఎమ్మెల్యే పాపారావును ఎక్కకుండా అడ్డుకున్నారు. అలాగే పాపారావుకు సొంత తమ్ముడు అయిన మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న నారపుశెట్టి పిచ్చయ్యను హెలిపాడ్ వద్ద సీఎంకు బొకే ఇచ్చేందుకు కూడా కలవనివ్వలేదు. వార్డు మెంబర్లు సైతం బొకేలు ఇస్తే నగర పంచాయతీ చైర్మన్‌గా ఉన్న తనను కలవనీయకపోవడంతో ఆయన తీవ్ర అవమానంగా భావించారు. ఈ పరిణామాలతో రగిలిపోతున్న నారపుశెట్టి వర్గీయులు గొట్టిపాటి లక్ష్మి తీరుపై మండిపడుతున్నారు. దర్శిలో కాపులు అధికంగా ఉన్నా ఎన్నికల ముందు చివరి నిమిషంలో పోటీకి వస్తే పూర్తిస్థాయిలో సహకరించిన తమ నాయకుడిని పక్కనపెట్టే ప్రయత్నం చేస్తోందని పాపారావు వర్గీయులు మదనపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం తన కార్యాలయంలో గొట్టిపాటి లక్ష్మి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నారపుశెట్టి పాపారావుతో పాటు ఆయన సోదరుడు పిచ్చయ్య కూడా గైర్హాజరయ్యారు. దీనికి తోడు వారి సమాజిక వర్గానికే చెందిన మార్కెట్ యార్డ్ చైర్మన్ దారం నాగవేణి సుబ్బారావు కూడా హాజరుకాలేదు. విలేకరుల సమావేశానికి పాపారావు వస్తారని దాదాపు రెండు గంటల పాటు గొట్టిపాటి లక్ష్మి ఎదురుచూసినట్లు సమాచారం. పాపారావు తండ్రి దివంగత మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి శ్రీరాములు సౌమ్యుడు, వివాద రహితుడిగా పేరుంది. పాపారావు గత మూడు ఎన్నికల నుంచి ఎమ్మెల్యే టిక్కెట్ ఆశిస్తూ వస్తున్నారు. టిక్కెట్ ఇవ్వకపోయినా టీడీపీకే తన మద్దతు తెలియజేస్తూ ఆ పార్టీలోనే కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్‌గా వచ్చిన గొట్టిపాటి లక్ష్మి ఆయనను పార్టీకి దూరం పెడుతున్నారన్న చర్చ ప్రధానంగా నియోజకవర్గంలో సాగుతోంది. ఇటీవల పాపారావుకు హుడా చైర్మన్ పదవిని కేటాయించి కూడా నిలిపేశారు. తనకు చైర్మన్ పదవి ఇవ్వకుండా పాపారావుకు ఇస్తే తనకేం ప్రోటోకాల్ ఉంటుందని గొట్టిపాటి లక్ష్మి ఆ పదవి రాకుండా అడ్డుకుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

రాష్ట్ర స్థాయి పోటీలకు చీమకుర్తి క్రీడాకారిణిలు

చీమకుర్తి: చీమకుర్తిలోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూలుకు చెందిన క్రీడాకారిణిలు రాష్ట్ర స్థాయి బాల్ బాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. ఆదివారం కావలి సమీపంలోని చేవూరులో జరిగిన అంతర జిల్లా స్థాయి బాలికల పోటీల్లో చీమకుర్తి నుంచి ఎంపికైన వారి వివరాలను పీడీ డీ.స్వరూపావాణి చీమకుర్తిలోని మీడియాకు తెలిపారు. జూనియర్ బాడ్మింటన్ పోటీలకు దీక్ష, సబ్ జూనియర్ పోటీలకు కృప, మేఘన, అక్షయ ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో జూనియర్స్‌కు అనంతపురంలోను, సబ్‌జూనియర్స్‌కు చేవూరులో రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహిస్తారని పీడీ తెలిపారు. ఎంపికైన క్రీడాకారిణిలను చీమకుర్తి జిల్లా పరిషత్ బాలికల హైస్కూలు టీచర్స్, వారి తల్లిదండ్రులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.



రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన చీమకుర్తి జెడ్పీ బాలికల హైస్కూలు క్రీడాకారిణిలు

లోకేష్‌కు దమ్ముంటే విద్యార్థి సంఘాలతో చర్చకు రావాలి

- పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.రాజశేఖర్

ఒంగోలు టౌన్: రాష్ట్రంలో కార్పొరేట్ విద్యా సంస్థల దోపిడీ, విద్యార్థుల రక్తాన్ని ఫీజుల రూపంలో జుర్రుకుంటున్న తీరు రాష్ట్ర ప్రభుత్వానికి కనపడడంలేదా అని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ ప్రశ్నించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. చైతన్య, నారాయణ వంటి కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యార్థుల నుంచి పుస్తకాలు, యూనిఫారం, షూ, బెల్టుల రూపంలో వేలాది కోట్ల రూపాయలు వసూలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకుండా కళ్లకు గంతలు కట్టుకుందని ధ్వజమెత్తారు. ఈ సమస్యలను పరిష్కరించకుండా విద్యా సంస్థల్లోకి రాజకీయ పార్టీలను రానివ్వకుండా ఉత్తర్వులు జారీ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థి సంఘాలతో చర్చలు జరపాలని, వారి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని విద్యారంగం అభివృద్ధికి పాటుపడాలని కోరారు. ప్రభుత్వ విద్యా సంస్థలు బలహీన పడడానికి పాలక పార్టీలు ఏ విధంగా దోహదపడ్డాయో బహిరంగ విచారణకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రపంచ బ్యాంకు విధానాలకు లోబడి మొత్తం ప్రాథమిక విద్యారంగాన్ని, ఉన్నత విద్యా వ్యవస్థను ధ్వంసం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నాలను చూస్తూ కూర్చోమని స్పష్టం చేశారు.

ఈ వాచ్‌మన్ వద్దండి

- దర్శి ఎస్సీ బాలికల హాస్టల్ వద్ద తల్లిదండ్రుల నిరసన
- వాచ్ ఉమన్ బదులు భర్త విధుల్లో ఉండటంపై ఆగ్రహం



అధికారులతో మాట్లాడుతున్న తల్లిదండ్రులు

దర్శి: పట్టణంలోని లంకోజనపల్లి రోడ్డులో ఎస్సీ సంక్షేమ బాలికల హాస్టల్లో వాచ్ ఉమన్ బదులు ఆమె భర్త విధులు నిర్వహించడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వాచ్ మెన్‌గా పురుషుడు వద్దంటూ ఏఎస్‌డబ్ల్యూఓకు ఆదివారం రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ.. బాలికల హాస్టల్లో వాచ్ ఉమన్ డ్యూటీ చేయాల్సిన స్వప్న తన భర్తను విధులకు ఎలా పంపుతోందని, ఆడపిల్లల హాస్టల్లోకి మగ వారిని ఎలా అనుమతించారని ఏఎస్‌డబ్ల్యూఓను ప్రశ్నించారు. దీనిపై ఏఎస్‌డబ్ల్యూఓ స్పందిస్తూ.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వాచ్ ఉమన్ స్వప్నను బదిలీ చేస్తామని హామీ ఇవ్వడంతో తల్లిదండ్రులు శాంతించి వెనుదిరిగారు. కాగా వాచ్‌మన్‌కు వార్డెన్‌కు మధ్య విభేదాల వల్ల హాస్టల్లో నిత్యం వివాదం చోటుచేసుకుంటున్నట్లు సమాచారం.

భూ కబ్జా ఆపండి

- మార్కాపురం మండలం నాగులవరంలో గ్రామస్తుల ధర్నా
- టీడీపీ నాయకుడి తీరుపై ఆగ్రహం



ధర్నా చేస్తున్న నాగులవరం గ్రామస్తులు

మార్కాపురం: తమ పొలాలను కబ్జా చేసేందుకు ఒక టీడీపీ నాయకుడు ప్రయత్నిస్తున్నాడని ఆరోపిస్తూ ఆదివారం మార్కాపురం మండలంలోని నాగులవరం గ్రామస్తులు ఆదివారం ధర్నా నిర్వహించారు. వారసత్వంగా వస్తున్న తమ పొలాలను మార్కాపురం పట్టణానికి చెందిన ఒక టీడీపీ నేత ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నాడని, తమ భూములను కాపాడి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. భూ కబ్జా విషయంపై ఇప్పటికే రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ధర్నాలో గ్రామానికి చెందిన మంగమ్మ, వెంకటేశ్వర్లు, ఏడుకొండలు, గురుస్వామి, పెద్ద అంకయ్య, ఆంజనేయులు, లక్ష్మీదేవి తదితరులు పాల్గొని టీడీపీ నాయకుడి తీరును తూర్పారబట్టారు. తమకు ఆ పొలమే జీవనాధారమని, తమ పొలాన్ని సర్వే చేసి కబ్జా కాకుండా చూడాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి



కారులో ఇరుక్కుపోయిన గంగాధర్

టంగుటూరు: జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఆదివారం సంభవించిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృత్యువాతపడగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. టంగుటూరు మండలంలోని సూరారెడ్డిపాలెం ఫ్లయ్ ఓవర్‌పై చోటుచేసుకున్న ప్రమాదంలో అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం చిన్నులగారిపల్లి గ్రామానికి చెందిన పులి గంగాధర్(35) మృతి చెందారు. ఆయన తన భార్య గాయత్రి, అత్త రాధ, కొడుకు గంధర్వ్‌తో కలిసి చెన్నై నుంచి కారులో హైదరాబాద్ వెళ్తున్నారు. ఈ క్రమంలో సూరారెడ్డిపాలెం ఫ్లయ్ ఓవర్‌పై ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టడంతో గంగాధర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ఆయన మరణించారు. ఈ ప్రమాదంలో గంగాధర్ అత్త రాధ, అతని కొడుకు గంధర్వ్ గాయపడగా చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని ఎస్సై నాగమల్లేశ్వరరావు పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రక్ ఢీకొని యువకుడు మృతి

పొదిలి: మినీ ట్రక్ ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం పొదిలి టైలర్స్ కాలనీ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. చీమకుర్తి మండలం లక్ష్మీపురం పంచాయతీ రాజుపాలేనికి చెందిన సుబ్బారావు పొదిలి పెద్ద చెరువు సాగర్ పైప్ లైన్ నిర్మాణ పనుల్లో క్రేన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. మల్లవరం సమీపంలో పనులు ముగించుకొని స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్న సుబ్బారావును టైలర్స్ కాలనీ వద్ద ఒంగోలు నుంచి కనిగిరి వైపు వేగంగా వెళ్తున్న మినీ ట్రక్ ఢీకొట్టింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు.



మృతి చెందిన సుబ్బారావు

పాతాళంలోకి నిమ్మ ధర!



చెట్ల కింద నుంచి ఏరి తోట గట్లపై పోసిన నిమ్మకాయలు

- తోటల్లో చెట్లకే వదిలేయడంతో రాలిపోతున్న నిమ్మకాయలు
- ధర లేకనే వదిలేశామంటున్న రైతులు
- కాయలు తీసుకొచ్చినా కొనుగోలు చేయమంటున్న వ్యాపారులు
- పాదుల్లో వదిలేసిన కాయలు కుళ్లిపోయి సోకుతున్న నల్లి తెగులు
- నల్లి తెగులుతో దెబ్బతింటున్న నిమ్మ తోటలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు
- నష్టాలు తప్పడం లేదంటున్న నిమ్మ రైతులు

హనుమంతునిపాడు:

నిమ్మకాయల ధరలు పాతాళంలోకి పడిపోవడంతో ఆ రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. నష్టాలు తప్పేలా లేవంటూ ఆందోళన చెందుతున్నారు. కాయలు కోసి మార్కెట్‌కు తీసుకెళ్లినా.. వ్యాపారులు కొనుగోలు చేయమని చెప్పడంతో దిక్కుతోచని స్థితిలో తోటల్లోని చెట్లకే కాయలు వదిలేస్తున్నారు. అవన్నీ రాలిపోయి చెట్ల కింద పడుతున్నాయి. చెట్ల పాదుల్లో అలాగే వదిలేయడంతో ఆ కాయలన్నీ కుళ్లిపోయి ఆ వాసనకు నల్లి తెగులు వ్యాపిస్తోంది. ఈ తెగులు చెట్లకు సోకి ఏకంగా తోటలన్నీ తెగులు బారిన పడుతుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే, కూలీల ఖర్చులకు, ఆటో బాడుగలకు సరిపడా ధరలు కూడా పలకకపోవడంతో కాయను కోయడం కంటే చెట్లకు వదిలేయడమే మేలనే రైతులు వదిలేస్తున్నారు.



రాలిపోతున్న కాయను చూపిస్తున్న రైతు దేవదానం

కిలో రూ.2 నుంచి రూ.3 మాత్రమే...

నిమ్మ ధరలు నిలకడ లేకుండా రోజుకో ధర పలుకుతోంది. హనుమంతునిపాడు మండలం నిమ్మ సాగులో జిల్లాలోనే మొదటి స్థానంలో ఉంది. 2,874 హెక్టార్లకుపైగా సాగుచేస్తున్నారు. ముదురు, లేత తోటల సాగు సుమారు 2000 ఎకరాలపైబడి జరుగుతోంది. ఈ మండలం నుంచి ప్రతిరోజూ కనిగిరి మార్కెట్‌కు ఆటోలు, మినీ లారీల్లో నిమ్మకాయలు తరలిస్తుంటారు. ఇటీవల ధర పూర్తిగా పడిపోవడంతో రైతులకు సమస్యలొచ్చిపడ్డాయి. ప్రస్తుతం నిమ్మకాయలు కిలో రూ.2 నుంచి రూ.3కు మించి పలకడం లేదు. కమిషన్ వ్యాపారులు ధర లేదని కాయను కొనుగోలు చేయడం లేదు. పచ్చి కాయ కిలో రూ.5 నుంచి రూ.6 మించి కొనుగోలు చేయడం లేదు. కోత కూలీలు, ఆటో బాడుగలు కూడా రావడం లేదు. ఈ ఏడాది మొదటి నుంచి నిమ్మకు ధర లేకపోవడంతో రైతులు నష్టాల్లో కూరుకుపోయారు. ప్రభుత్వం నిమ్మ రైతుల గురించి పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నల్లి తెగులుతో దెబ్బతింటున్న నిమ్మ తోటలు...

నిమ్మకాయలను చెట్లకే వదిలేయడంతో అవన్నీ పండిపోయి రాలిపోతున్నాయి. పాదుల్లో కుళ్లిపోతున్నాయి. కుళ్లిన వాసనకు నల్లి తెగులు సోకి చెట్ల ఆకులు సైతం రాలిపోతున్నాయి. ఎండు పుల్లల తెగులు కూడా సోకుతోంది. వైరస్ సోకడంతో తోటలన్నీ పూర్తిగా దెబ్బతింటున్నాయి. దీంతో రాలిన కాయను ఏరి రోడ్ల పక్కన పోస్తూ రైతులు నలిగిపోతున్నారు.

పట్టించుకోని హార్టికల్చర్ అధికారులు...

నిమ్మతోటల్లో నల్లి తెగులు, వైరస్ వ్యాపిస్తున్నప్పటికీ హార్టికల్చర్ అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వాటి నివారణ చర్యల గురించి రైతులకు కనీస సలహాలు, సూచనలు కూడా ఇవ్వకుండా అలసత్వం ప్రదర్శిస్తున్నారు. నిమ్మతోటలకు వేరు కుళ్లు, ఎండుపుల్ల తెగులు, పేను బంక, కాయకు మంగు, మచ్చలు వచ్చి నాణ్యత కోల్పోతున్నాయి. మంగు, గజ్జి, మచ్చలున్న కాయను గ్రేడ్ చేసి పనికి రావంటూ రోడ్ల పక్కన పోస్తున్నారు.

> **ఈ ఏడాది పూర్తిగా నష్టపోయాం**
>
> నిమ్మకాయకు ధర లేక కాయను కోయడం లేదు. కిలో రూ.2కు కూడా వ్యాపారుల అడగడం లేదు. కోత కూలీలకు వచ్చేలా కూడా ధరలు లేకపోవడంతో 5 ఎకరాల్లో సాగుచేస్తున్న నిమ్మ తోటల్లో కాయను కోయకుండా వదిలేశాను. ఈ ఏడాది పూర్తిగా నష్టపోయాం. నిమ్మ రైతు గురించి పట్టించుకునే నాథుడే లేడు.
>
> – జి.దేవదానం, రైతు, సీతారాంపురం

రైతులను ఆదుకోలేని సీఎం బనకచర్ల నిర్మిస్తారా?

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి



సీపీఎం జిల్లా స్థాయి విస్తృత సమావేశంలో ప్రసంగిస్తున్న డి.రమాదేవి

ఒంగోలు టౌన్: గిట్టుబాటు ధరలు రాక ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రంలోని రైతులను ఆదుకోలేని ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష కోట్ల రూపాయలతో బనకచర్ల ప్రాజెక్టు నిర్మిస్తానని చెప్పడం హాస్యాస్పదమని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి విమర్శించారు. స్థానిక సుందరయ్య భవనంలో ఆదివారం నిర్వహించిన సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దర్శి పంట పొలాల్లో మీటింగ్ పెట్టి రైతుల బ్యాంకు ఖాతాల్లో కేవలం రూ.5 వేలు వేశారని, దీని వలన రైతుల సమస్యలు ఎలా పరిష్కారమవుతాయో చెప్పాలని ప్రశ్నించారు. బర్లీ, వర్జీనియా పొగాకు కొనుగోలు చేసేందుకు రూ.1000 కోట్లు కేటాయించాలని రైతులు అడుగుతుంటే స్పందించని ముఖ్యమంత్రి మాయ మాటలతో మభ్యపెట్టాలని ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. చిత్తూరు జిల్లాలో అమరరాజా కంపెనీ జ్యూస్ కంపెనీ ఏర్పాటు చేయడంతో చిన్న, చితక ఫ్యాక్టరీలు మూతపడ్డాయని, దీనివల్లనే మామిడికి ధరలు రాలేదని చెప్పారు. కనీసం కూలి కూడా దక్కని పరిస్థితుల్లో మామిడి రైతులకు రూ.100 కోట్లు కేటాయించాలని కోరినా ముఖ్యమంత్రి చంద్రబాబుకు చెవికెక్కడం లేదని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్నీ రకాల పంటలకు గిట్టుబాటు ధరలు రాక రైతులు అల్లాడిపోతున్నారని చెప్పారు. రైతులు, సామాన్య ప్రజలు పెరిగిన ధరలతో అల్లాడి పోతుంటే ట్రూ అప్ చార్జీలు, సర్దుబాటు చార్జీల పేరుతో విద్యుత్ చార్జీలను పెంచడం దుర్మార్గమన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను పగులగొట్టమని ప్రచారం చేసిన టీడీపీ ఇప్పుడు అధికారంలోకి వచ్చాక అదే స్మార్ట్ మీటర్లను బిగించడం ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు.

విద్వేషాలను రెచ్చగొడుతున్న ఉప ముఖ్యమంత్రి ..

ఉప ముఖ్యమంత్రి హోదాలో ఉన్న పవన్ కళ్యాణ్ చరిత్రను వక్రీకరిస్తూ సినిమాలు తీయడం ద్వారా సమాజంలో విద్వేషాలను రెచ్చగొడుతున్నారని రమాదేవి ఆరోపించారు. మైనారిటీల మనోభావాలను దెబ్బతీయడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనన్నారు. మహారాష్ట్ర, బీహారు ఎన్నికల్లో తమకు అనుకూలంగా ఉండేలా ఓటర్ల ప్రత్యేక సవరణ నాటకాలాడుతున్నారని ధ్వజమెత్తారు. జిల్లా సీపీఎం కార్యదర్శి ఎస్కే మాబు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేసేలా ఓటర్ల ప్రత్యేక సవరణ జాబితా రూపొందించేందుకు చేస్తున్న ప్రయత్నాలను తప్పుపట్టారు. కార్యక్రమంలో సయ్యద్ హనీఫ్, చీకటి శ్రీనివాసరావు, కొండారెడ్డి, ఎం.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిమళించిన మానవత్వం



ప్రసాద్‌కు స్నానం చేయిస్తున్న నారాయణరెడ్డి

గిద్దలూరు రూరల్: పట్టణానికి చెందిన గలిబిలి ప్రసాద్ అనే వ్యక్తి మద్యానికి బానిసై కుటుంబ సభ్యులకు దూరమయ్యాడు. స్థానిక గ్రంథాలయం ఎదుట రోడ్డు మీద గత 5 రోజుల నుంచి పడిపోయి ఉన్నాడు. అక్కడే మలమూత్ర విసర్జన చేస్తూ దుర్భర స్థితిలో పడి ఉన్న అతని సమీపంలోకి వెళ్లేందుకు స్థానికులు సాహసం చేయలేదు. సమాచారం తెలుసుకున్న ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బీఎస్ నారాయణరెడ్డి స్పందించి మున్సిపల్ సిబ్బంది సహాయంతో ప్రసాద్‌కు క్షవరంతోపాటు స్నానం చేయించి నూతన వస్త్రాలు వేయించారు. అనంతరం ప్రసాద్‌ను కడప జిల్లా కాశినాయన మండలం ఓబులాపురం గ్రామంలోని వివేకానంద సేవాశ్రమానికి తరలించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డిని స్థానికులు అభినందించారు.

మద్యం మత్తులో మిత్రుల ఘర్షణ

- బైక్‌పై పెట్రోల్ పోసి తగలబెట్టిన వైనం



మంటల్లో కాలిపోతున్న బైక్

ఒంగోలు టౌన్: మద్యం మత్తులో ఉన్న ముగ్గురు మిత్రుల మధ్య మాటామాటా పెరిగి ఘర్షణ చోటుచేసుకోగా.. ఓ యువకుడు పెట్రోల్ పోసి బైకును తగలబెట్టాడు. ఈ సంఘటన ఒంగోలు-కర్నూలు రోడ్డులోని పాలకేంద్రం సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన లోనా రాం, అర్జున్, కిషోర్ స్నేహితులు. ముగ్గురూ చీమకుర్తి గ్రానైట్ పరిశ్రమల్లో పనులు చేస్తుంటారు. ఆదివారం కావడంతో సరదాగా ఒంగోలు నగరానికి వచ్చారు. తాము తెచ్చుకున్న బైకులో పెట్రోల్ అయిపోవడంతో పాలకేంద్రం వద్ద ఉన్న ఇండస్ట్రియల్ ఏరియాలో ఉంచారు. ఒక బాటిల్లో పెట్రోలు పోయించుకుని వస్తూ మార్గమధ్యంలోని ఓ వైన్ షాప్‌లో ముగ్గురూ కలిసి మద్యం తాగారు. మత్తు తలకెక్కడంతో వారి మధ్య మాటల యుద్ధం మొదలైంది. రెండు గ్రూపులుగా విడిపోయి కొట్టుకున్నారు. ఆ కోపంతో ఓ వర్గం యువకుడు బైక్‌కు నిప్పంటించి తగులబెట్టాడు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

ఉమ్మడి సీనియారిటీ ప్రాతిపదికన ప్రమోషన్లు ఇవ్వాలి

- ఎంఈఓల నియామకాల్లో సీనియర్లను పక్కనబెట్టడం సరికాదు
- విద్యాశాఖ తప్పు సరిదిద్దుకోకుంటే రాష్ట్ర స్థాయిలో ఉద్యమం
- ప్రభుత్వానికి ఫ్యాప్టో, జాక్టో సంఘాల హెచ్చరిక



విద్యాశాఖ తీరుపై చర్చిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

ఒంగోలు సిటీ: ఉమ్మడి సీనియారిటీ ప్రాతిపదికపై ప్రమోషన్లు ఇవ్వాలని ప్రధానోపాధ్యాయుల సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఒంగోలులోని ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘ కార్యాలయంలో ఫ్యాప్టో, జాక్టో ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘం, మండల విద్యాశాఖ అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి ఐక్య వేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ.. మొట్టమొదట పీఆర్టీయూ పక్షాన ఒకే నియామక పరీక్ష ద్వారా ఉపాధ్యాయులుగా ఎంపికైన వారి ఖాళీలను బట్టి వివిధ మేనేజ్‌మెంట్ల పాఠశాలల్లో నియమించారన్నారు. అయినప్పటికీ పాఠశాల విద్యాశాఖ నియంతృత్వ ధోరణితో స్కూల్ అసిస్టెంట్లను ఎంఈఓలుగా నియమించిందని, వారికంటే సీనియర్ ప్రధానోపాధ్యాయులు, సీనియర్ స్కూల్ అసిస్టెంట్లు ఉన్నప్పటికీ జూనియర్లను ఎంఈఓలుగా నియమించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఉమ్మడి సీనియారిటీ ప్రకారం ప్రమోషన్లు ఇవ్వకపోతే రాష్ట్ర స్థాయిలో ఉద్యమిస్తామని, దీనిపై న్యాయ పోరాటం చేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు. డైట్ లెక్చరర్లు సీనియర్ లెక్చరర్లుగా ప్రమోషన్ పొందగానే డీఈఓలుగా ఎఫ్ఏసీ ఇచ్చారు కానీ డైట్ లెక్చరర్లకు ఈక్వల్ గా ఉన్న ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలను మాత్రం డీవైఈఓలుగా, డీఈఓలుగా నియమించకపోవడం చాలా అన్యాయమని, ఈ విధానాన్ని ఖండిస్తున్నామన్నారు. జాక్టో తరఫున శ్రీనివాసరావు, నరహరంజిరెడ్డి, మల్లికార్జున రావు ఫ్యాప్టో తరఫున అబ్దుల్ హై, రఘు, సుబ్బారావు, శ్రీనివాసరావు, పర్రె వెంకట్రావు, ప్రధానోపాధ్యాయుల సంఘం తరఫున వై.వెంకట్రావు. సాయి శ్రీనివాసరావు, మండల విద్యాశాఖ అధికారుల సంఘం తరఫున కిషోర్ బాబు, నాగేంద్రవదన్ పాల్గొన్నారు.

రామతీర్థం జలాశయానికి సాగర్ జలాలు

చీమకుర్తి రూరల్:

మండలంలోని రామతీర్థం జలాశయంలోకి సాగర్ జలాలు ఒంగోలు బ్రాంచి కెనాల్ ద్వారా ప్రవేశించాయి. తాగు, సాగు నీటి అవసరాల కోసం సాగర్ జలాలు విడుదల చేశారు. ఒంగోలు బ్రాంచి కెనాల్ ద్వారా 1100 క్యూసెక్కుల నీరు రామతీర్థం జలాశయంలోకి చేరుతోంది. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 85.34 మీటర్లు కాగా ప్రస్తుతం 79.95 మీటర్లు నీటి నిల్వ ఉంది. ఐదు రోజుల్లో పూర్తిస్థాయి మట్టానికి నీరు చేరే అవకాశం ఉంది.



రామతీర్థం జలాశయంలోకి వస్తున్న సాగర్ జలాలు

నిరుపేదల ఉపాధికి గండి..

అన్నం పెట్టే రైతులకు సున్నం

- వ్యవసాయ రంగంలో మహిళల శ్రమకు గుర్తింపు లేదు
- ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కంకణాల రమాదేవి



ఐద్వా జిల్లా మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంగోలు టౌన్: వ్యవసాయ రంగంలో 70 శాతానికి పైగా పనిచేస్తున్న మహిళలకు తగిన గుర్తింపు దక్కడం లేదని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా ప్రధాన కార్యదర్శి కంకణాల రమాదేవి పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా పంపిణీ వ్యవస్థను నీరుగార్చి ఆహార భద్రతకు తూట్లు పొడుస్తున్నాయని మండిపడ్డారు. ఆదివారం ఒంగోలులోని ఐద్వా కార్యాలయంలో జిల్లా మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ.. గ్రామీణ నిరుపేదలకు ఆసరాగా ఉన్న ఉపాధి హామీ పథకాన్ని పక్కదారి పట్టించారని, దేశానికి అన్నం పెట్టే రైతన్నలను దెబ్బ తీస్తూ వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు నిర్వహించేందుకు మహిళను సమాయత్తం చేస్తున్నామని చెప్పారు. ఈ నెల 19, 20వ తేదీల్లో కొండపిలో నిర్వహించనున్న ఐద్వా 13వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సయ్యద్ షర్మిల మాట్లాడుతూ.. పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ కరువైందన్నారు. గత మూడేళ్ల కాలంలో చేపట్టిన ఉద్యమాలను సమీక్షించుకుని భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలకు మహాసభల్లో కార్యాచరణ రూపొందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు ఊసా రాజ్యలక్ష్మి, నెరుసుల మాలతి, ఎ.ఆదిలక్ష్మి, కె.ప్రసన్న, భావన రాజ్యలక్ష్మి, డి.శారా, కె.రాజేశ్వరి, శాంత కుమారి, అనంతలక్ష్మి, టి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహిళా క్రికెట్ జట్టు ఎంపిక

ఒంగోలు:

స్థానిక మంగమూరు రోడ్డులోని ఏసీఏ క్రికెట్ సబ్ సెంటర్ మైదానంలో ఆదివారం సీనియర్ మహిళా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. అండర్ 23, సీనియర్ మహిళా క్రికెట్ జట్ల ఎంపికకు ఉమ్మడి జిల్లా నుంచి మహిళా క్రికెటర్లు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఫీల్డింగ్, బ్యాటింగ్, కీపింగ్, బౌలింగ్ తదితర అంశాల్లో క్రీడాకారుల ప్రతిభను కోచ్‌లు కొప్పోలు సుధాకర్, లెఫ్ట్ శ్రీను, చంద్ర పరిశీలించారు. మొత్తం 20 మంది ప్రతిభావంతులకు ఈనెల 9, 10వ తేదీల్లో బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం రావినూతల క్రికెట్ స్టేడియంలో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. అనంతరం వారిలో 16 మంది క్రీడాకారులను తుది జట్టుకు ఎంపిక చేస్తామని ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కారుసాల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఎంపికైన జట్లు ఈనెల 14 నుంచి 17వ తేదీ వరకు ఎన్టీఆర్ జిల్లా మూలపాడులో నిర్వహించనున్న అంతర్ జిల్లా క్రికెట్ పోటీల్లో ప్రకాశం జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఎంపిక ప్రక్రియను ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు నవీన్‌కుమార్, సంయుక్త కార్యదర్శి బచ్చు శ్రీనివాసరావు, కోశాధికారి హనుమంతరావు, సభ్యులు బలరాం పర్యవేక్షించారు.



ఎంపికైన మహిళా క్రికెట్ జట్టు